ఆశల బడి.. సమస్యల ఒడి



ఎంజీఎం హై స్కూల్‌లో బాత్‌రూమ్‌లు



ఎంజీఎం హైస్కూల్‌లో విరిగిపోయిన బాత్‌రూమ్ తలుపులు



అచ్చియ్యమ్మపేట స్కూల్‌లో ఆట వస్తువులు

- నేటి నుంచి పాఠశాలలు ప్రారంభం
- తల్లికి వందనం వచ్చేనా.. లబ్ధిదారుల ఆందోళన
- పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు మృగ్యం
- అధ్వానంగా మరుగుదొడ్లు.. శుభ్రత లేని తాగునీటి పైపులు

అల్లిపురం: నూతన విద్యా సంవత్సరంలోకి అడుగిడేందుకు విద్యార్థులు ఉత్సాహం చూపిస్తున్నారు. కానీ పాలకుల నిర్లక్ష్యం కారణంగా వారికి సమస్యలు స్వాగతం పలుకుతున్నాయి. జీవీఎంసీ పాఠశాలల్లో కనీసం గత ప్రభుత్వం నాడు–నేడు పథకం కింద ఏర్పాటు చేసిన మౌలిక సదుపాయాలకు సెలవుల్లో మరమ్మతులు కూడా చేయించకపోవడం విమర్శలకు తావిస్తోంది. ప్రతి ఏడాది జూన్ 12వ తేదీన పాఠశాలలు పునః ప్రారంభించడం ఆనవాయితీగా వస్తోంది. ఆలోగా పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించి విద్యార్థులకు స్వాగతం పలికేందుకు ముస్తాబు చేసేవారు. గత ఐదేళ్లుగా అదే కొనసాగింది. కనీసం పాఠశాలల్లో మౌలిక వసుతుల కల్పనకు ఒక్క రూపాయి కూడా కేటాయించకపోవడం పట్ల విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

నియోజకవర్గంలో పలు పాఠశాలలు..

నియోజకవర్గంలో ప్రభుత్వ క్వీన్ మేరీ స్కూల్, ప్రభుత్వ హైస్కూల్, రైల్వే క్వార్టర్స్ స్కూలు ఉండగా జీవీఎంసీ స్కూల్స్, ప్రకాశరావుపేట, దండు బజార్, ఎంజీఎం హైస్కూల్, ఎంవీడీఎం హైస్కూల్, ఆర్‌సీఎం హైస్కూల్‌తో పాటు అల్లిపురం మోడల్ స్కూల్, అచ్చియ్యమ్మపేట స్కూల్, అల్లిపురం న్యూ స్కూల్ ఉన్నాయి. వాటిలో విద్యార్థులకు కనీస మౌలిక సదుపాయాలు కల్పించలేదు.

అధ్వానంగా బాత్‌రూమ్‌లు..

ఎంజీఎం హైస్కూల్‌లో విద్యార్థులు ఉపయోగించే బాత్‌రూమ్‌లు అధ్వానంగా తయారయ్యాయి. వాటి డోర్లు విరిగిపోయాయి. పరిసరాలు అపరిశుభ్రంగా మారాయి. అచ్చియ్యమ్మపేట ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు తాగే మంచినీటి కుళాయిలు అపరిశుభ్రంగా మారాయి. గత ఏడాది ఒక స్వచ్ఛంద సంస్థ ముందుకు వచ్చి పాఠశాలలో మౌలిక సదుపాయాలు కల్పించింది. స్థానికంగా గల ఆకతాయిల వల్ల అవి దెబ్బతిన్నాయి.

తల్లికి వందనం వస్తుందా..?

గత ఐదు సంవత్సరాలుగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అమ్మ ఒడి పథకాన్ని పాఠశాలలు ప్రారంభమయ్యే సమయానికి సచివాలయ సిబ్బంది, వలంటీర్ల సహకారంతో దరఖాస్తు చేయించి, బ్యాంకు అకౌంట్ లింక్ చేసేవారు. సమయానికి అమ్మ ఒడి అందటంతో లబ్ధిదారులు తమ పిల్లలకు అన్ని సదుపాయాలు కల్పించుకోగలిగేవారు. పాఠశాల ప్రారంభం రోజునే విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, బ్యాగులు, బూట్లు, టై, యూనిఫామ్ అందజేసేవారు. కానీ ఈ ఏడాది ఇప్పటి వరకు పాఠ్య పుస్తకాలు, యూనిఫామ్‌లు పాఠశాలలకు బుధవారం సాయంత్రానికి కూడా చేరుకోలేదు. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చిన తల్లికి వందనం పథకానికి ఇప్పటి వరకు దరఖాస్తు చేసుకునే వీలు కూడా లేకుండా పోయింది. మరో పక్క ప్రభుత్వ పెద్దలు పాఠశాలల ప్రారంభ రోజునే అమ్మకు వందనం డబ్బులు అకౌంట్లలో జమ చేస్తామని ప్రకటించారు. ఈ నేపథ్యంలో గత ఏడాది అమ్మకు వందనం రానే లేదు. ఈ ఏడాది కూడా వస్తుందో లేదో అన్న మీమాంసలో విద్యార్థుల తల్లిదండ్రులు ఉన్నారు.



ఎంజీఎం హైస్కూల్ ప్రధాన ద్వారం



అచ్చియ్యమ్మపేట ప్రాథమిక పాఠశాల

తల్లికి వందనం పడుతుందో లేదో..

పాఠశాలలు ప్రారంభం కాగానే అమ్మకి వందనం ఇస్తామని చెప్పారు. 12వ తేదీన స్కూల్స్ రీ ఓపెనింగ్ తర్వాత పడతాయేమో చూడాలి. గతంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఉన్నప్పుడు అంతా సచివాలయ సిబ్బంది, వలంటీర్లు చూసుకునేవారు. బయోమెట్రిక్ తీసుకునేవారు. కానీ ఇప్పుడు వలంటీర్లు లేక ఏమీ తెలియడం లేదు.

– ఎస్.రాజ్యలక్ష్మి, నీలాపువారివీధి, అల్లిపురం

పడతాయనుకుంటున్నా..

స్కూళ్లు తెరుస్తున్నారు. ప్రభుత్వం ప్రకటించినట్లు పాఠశాలలు తెరచిన రోజే అమ్మకి వందనం డబ్బులు అకౌంట్లలో పడతాయని చెబుతున్నారు. పడతాయని మేము కూడా భావిస్తున్నాం. గత ఏడాది ఎలాగూ పడలేదు. కనీసం ఈ ఏడాది అయినా పడతాయని ఆశిస్తున్నాం. పడితే పిల్లల చదువుకు ఉపయోగపడతాయని ఆశ.

– పి.అలేఖ్య, అమ్మవారివీధి, అల్లిపురం

ఆక్రమణలో ఫుట్‌పాత్..



ఫుట్‌పాత్‌ని ఇలా ఆక్రమించిన దృశ్యం

డాబాగార్డెన్స్: సాధారణంగా ఫుట్‌పాత్‌లు పాదచారులు నడవడానికి ఏర్పాటు చేస్తారు. ట్రాఫిక్ నియంత్రణకు ఫుట్‌పాత్‌లు వాడుతుంటారు. అవే ఫుట్‌పాత్‌లపై చిరువ్యాపారులు కూటి కోసం చిన్నపాటి వ్యాపారాలు చేసుకుంటుంటారు. అటువంటి వారిపై అధికారులు ఝులుంచూపిస్తుంటారు. ఫుట్‌ఫాత్‌నే తన ఇంటిగా వాడుకుంటున్న ఆ ఇంటి యజమానిపై చర్యలు ఎందుకు తీసుకోవడం లేదంటూ ఆ ప్రాంత స్థానికుడు అధికారుల దృష్టికి తీసుకెళ్లాడు. అక్కడి తీరు చూస్తుంటే.. ఫుట్‌పాత్‌ని ఆ ఇంటి యజమాని కబ్జా చేశారా? లేదా ఆ ఇంటి యజమాని స్థలాన్నే జీవీఎంసీ అధికారులు ఫుట్‌పాత్ కింద ఏర్పాటు చేశారో తెలియడం లేదంటూ ఆ వినతిలో పేర్కొన్నారు. ఈ కబ్జా ఎక్కడో కాదు.. జోన్–4 పరిధి 28వ వార్డు నౌరోజీరోడ్డు సీఎంఆర్ గొడౌన్ ఎదురుగా జరిగిందని ఫిర్యాదీదారుడి అర్జీ ద్వారా తెలుస్తోంది.

ఎలక్ట్రీషియన్ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

పెదగంట్యాడ: నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (ఎన్ఏసీ), ఏపీ స్టేట్ నైపుణ్యాభివద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ఎన్ఏసీ అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్‌వీఎస్ఎస్ రవికుమార్ బుధవారం ఒక ప్రకటనలో కోరారు. జూనియర్ టెక్నీషియన్ స్మార్ట్ ఎనర్జీ మీటర్ కోర్సులో పది రోజుల పాటు ఉచిత శిక్షణ ఇవ్వనున్నామని పేర్కొన్నారు. ఎలక్ట్రికల్ రంగంలో అనుభవం కలిగిన వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. అభ్యర్థుల వయసు 21ఏళ్ల నుండి 55 సంవత్సరాల లోపు వారు అర్హులన్నారు. ఉచిత వసతి ఉంటుందని, స్టేషనరీ కూడా ఉచితంగా అందజేస్తామన్నారు. శిక్షణకు హాజరయ్యే వారికి ఆ రంగంలో కనీసం ఏడాది అనుభవం ఉండాలన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్లు అందజేస్తామన్నారు. మరిన్ని వివరాలకు 9394885164 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

క్లుప్తంగా

కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో లక్ష్మీ హోమం



హోమం నిర్వహిస్తున్న దృశ్యం

డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో జ్యేష్ఠ పౌర్ణమిని పురస్కరించుకుని బుధవారం శ్రీచక్ర నవ వర్ణార్చన, లక్ష్మీ హోమం జరిపారు. ఈ పూజలో నలుగురు ఉభయ దాతలు పాల్గొన్నారు. ప్రతి నెల పౌర్ణమి రోజున నిర్వహించే ఈ ప్రత్యేక పూజలో పాల్గొనే ఆసక్తి గల భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్ కొత్తరోడ్డు బ్రాంచ్, అకౌంట్ నంబరు 0608 10011006681, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081లో పూజా రుసుం చెల్లించాలి. ఆన్‌లైన్ ద్వారా ట్రాన్స్‌ఫర్ చేసిన భక్తుల వివరాలు, పూజ జరిపించాల్సిన వారి పేరు, గోత్రనామాలు, పూర్తి చిరునామా, ఫోన్ నంబరును endow eokanaka @gov. in మెయిల్‌కు పంపాలి. లేదా aptemples. ap.gov.inలో నమోదు చేసుకోవచ్చు.

సంపత్ వినాయగర్ ఆలయానికి రూ.లక్ష విరాళం



విరాళం అందజేస్తున్న మధుసూదన్ ప్రభు, సావిత్రి కుటుంబ సభ్యుడు

డాబాగార్డెన్స్ : సంపత్ వినాయగర్ ఆలయ అభివృద్ధికి హైదరాబాద్‌కు చెందిన మధుసూదన్ ప్రభు, సావిత్రి కుటుంబ సభ్యులు రూ.లక్ష విరాళాన్ని అందజేశారు. దేవస్థాన సహాయ కమిషనర్, ఆలయ ఈవో డీవీవీ ప్రసాదరావుకు బుధవారం ఆ చెక్కును అందజేశారు.

యోగాతో గుర్తింపు

అగనంపూడి: యోగా ప్రాధాన్యతను నలుదిశలా వ్యాపించేలా కార్యక్రమాలు నిర్వహించడం సంతోషంగా ఉందని బ్రహ్మకుమారీస్ అగనంపూడి (దివ్యజ్యోతి భవనం) ఇన్‌చార్జి బీకే రామకోటి అన్నారు. అగనంపూడి ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు, అధ్యాపకులకు బుధవారం ఉచిత యోగ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో పుట్టిన యోగాకు ప్రపంచ దేశాల్లో ప్రాధాన్యం సంతరించుకొనేలా చేస్తున్న కార్యక్రమాలు అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు దివ్య, శ్రీదేవి, సూర్య ప్రదీప్ పాల్గొన్నారు.

25 మద్యం సీసాల స్వాధీనం



తాతనాయుడు నుంచి స్వాధీనం చేసుకున్న మద్యం సీసాలు

పద్మనాభం: మండలంలోని చిన్నాపురం జంక్షన్‌లో బెల్టు షాపులు నిర్వహిస్తున్న ఇద్దరు వ్యక్తుల నుంచి 25 మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని, వీరిపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ జె.సురేష్ తెలిపారు. ఉల్లి సురేష్ కుమార్ నుంచి ఏడు మద్యం సీసాలను, జంకల తాతినాయుడు నుంచి 18 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. వీరిపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

గంజాయి విక్రయిస్తున్న ముగ్గురు యువకుల అరెస్ట్

ఎంవీపీకాలనీ: అప్పుఘర్ శ్మశానవాటిక సమీపంలో గంజాయి విక్రయిస్తున్న ముగ్గురు యువకులను ఎంవీపీ పోలీసులు అరెస్ట్ చేశారు. వారు తెలిపిన వివరాలిలా.. ఎంవీపీ ఎస్ఐ ఖాదర్ బాషాకు వచ్చి న సమాచారం మేరకు సిబ్బందితో కలిసి ఆయన బుధవారం 11 గంటల సమయంలో అప్పుఘర్ శ్మశానవాటిక వద్దకు వెళ్లగా.. అక్కడ ముగ్గురు యువకులు అనుమానాస్పదంగా కనిపించారు. వారి దగ్గరికి వెళ్లేందుకు ప్రయత్నించగా.. యువకులు పరారవ్వడానికి పరిగెట్టారు. అనంతరం వారిని అదుపులోకి తీసుకొని ప్రశ్నించ గా.. గంజాయి విక్రయిస్తున్నట్లు అంగీకరించారు. వేణు అనే వ్యక్తి నుంచి గంజాయి తీసుకొచ్చి కమీషన్ కోసం విక్రయాలు చేస్తున్నట్లు తెలిపారు. నక్కవానిపాలేనికి చెందిన బొర్రా వేణుబాబు, యెరుషు మహేష్, కేఆర్ఎం కాలనీకి చెందిన బక్కా మనోజ్‌కుమార్‌లను అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపించారు. వారి వద్ద నుంచి 2 కిలోల గంజాయితోపాటు రెండు సెల్ ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

వైభవంగా ఉమా చంద్రమౌళీశ్వర స్వామి కల్యాణోత్సవం



విశేష అలంకరణలో శ్రీ ఉమా చంద్రమౌళీశ్వరస్వామి



డ్రైఫ్రూట్స్‌తో స్వామి వారికి విశేష అలంకరణ

అల్లిపురం: టూటౌన్ దరి శ్రీ శివరామకృష్ణ దేవస్థానంలో వెలసిన శ్రీ ఉమా చంద్రమౌళీశ్వరస్వామి వార్షిక కల్యాణోత్సవం బుధవారం వైభవంగా నిర్వహించారు. ఆలయ ఈవో జీవీ రమాబాయి ఆధ్వర్యంలో ఆలయ అర్చకుడు భార్గవ శర్మ శైవాగమన సంప్రదాయంలో జరిపిన ఈ ఉత్సవంలో పలువురు దంపతులు పాల్గొన్నారు. వారికి ఈవో స్వామివారి శేష వస్త్రాలు, తీర్థ ప్రసాదాలు అందజేశారు. అన్నమయ్య సేవా ట్రస్ట్ బృందం కోలాటంతో అస్పెంగార్డెన్స్, టూటౌన్ రోడ్డు, డాబాగార్డెన్స్, నీలమ్మ వేపచెట్టు అమ్మవారి దేవస్థానం మీదుగా తిరువీధి ఉత్సవం నిర్వహించారు. ఉత్సవం సందర్భంగా స్వామి వారికి పంచామృతాభిషేకాలు, డ్రైఫ్రూట్స్‌తో విశేషంగా అలంకరించారు. ఈ కార్యక్రమంలో ఆధ్యాత్మికవేత్త ఎంవీ రాజశేఖర్, ఆలయ సిబ్బంది కేవీఎం మన్మథరెడ్డి, కె. గోపి, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

పిల్లల వైద్య సదుపాయంపై దృష్టి సారించాలి



డాక్టర్ వాణికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న గొందు సీతారాం

మహారాణిపేట: కేజీహెచ్‌లో పిల్లల వైద్య సదుపాయాలపై ప్రత్యేక దృష్టి సారించాలని రాష్ట్ర చైల్డ్ రైట్స్ అవేర్‌నెస్ ఫోరం కన్వీనర్ గొందు సీతారాం కోరారు. నూతన సూపరింటెండెంట్‌గా బాధ్యతలు చేపట్టిన డాక్టర్ ఐ.వాణిని సత్కరించారు. అనంతరం వివిధ సమస్యలు ఆమె దృష్టికి తీసుకెళ్లారు. ఆస్పత్రిలోని అన్ని విభాగాల్లో పిల్లల వైద్యం కోసం ప్రత్యేక బెడ్లు, వైద్యులు, సిబ్బందిని నియమించేలా చర్యలు చేపట్టాలని కోరారు. ప్రసూతి వార్డులో అనధికార దత్తతలపై అవగాహన పెంపొందించేలా వాల్ పోస్టర్లు, స్టిక్కర్లు అతికించాలన్నారు. సూపరింటెండెంట్ డాక్టర్ వాణి మాట్లాడుతూ చైల్డ్ రైట్స్ అవేర్‌నెస్ ఫోరం కోరినట్లు బాలల హక్కుల పరిరక్షణ, సంక్షేమానికి ప్రాధాన్యత కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో చైల్డ్ రైట్స్ అవేర్‌నెస్ ఫోరం ప్రతినిధి కె.ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇసుకకొండకు పోటెత్తిన భక్తులు



వ్రతంలో పాల్గొన్న దంపతులు

డాబాగార్డెన్స్: ఇసుకకొండ (బాబాజీకొండ)పై వెలసిన రమా సహిత సత్యనారాయణస్వామి ఆలయం బుధవారం భక్తులతో కిటకిటలాడింది. జ్యేష్ఠ శుద్ధ పౌర్ణమి సందర్భంగా స్వామికి ప్రత్యేక పూజలు, పంచామృతాభిషేకాలు చేశారు. వేకువజాము 4 గంటల నుంచే భక్తులు స్వామి దర్శనానికి బారులు తీరారు. ఆలయ మండపంలో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు జరిగాయి. ఆలయ ఈవో టి.రాజగోపాల్‌రెడ్డి ఏర్పాట్లు పర్యవేక్షించారు.



స్వామికి పూజలు చేస్తున్న ఆలయ అర్చకుడు



ప్రదక్షిణ చేస్తున్న భక్తులు

బడికి వేళాయె

ఆటలకు స్వస్తి

డాబాగార్డెన్స్: వేసవి సెలవులు ముగిసాయి. ఆటలకు పిల్లలు టాటా చెప్పి.. పాఠాలు వినడానికి సిద్ధమయ్యారు. ఒక వైపు ప్రభుత్వ పాఠశాలలు.. మరో వైపు ప్రైవేటు పాఠశాలలు సరస్వతీ నమస్తుభ్యమంటూ విద్యార్థులను తమ వైపు ఆకర్షిస్తున్నాయి. ప్రభుత్వ పాటశాలల్లో ఫలితాలు, విద్యా ప్రమాణాలు గణనీయంగా మెరుగుపడి ప్రైవేట్‌కు దీటుగా పని చేస్తున్నాయి. దీంతో గత ఏడాది వరకు సర్కార్ బడుల్లో చేరే విద్యార్థుల సంఖ్య పెరుగుతూ వచ్చింది. ఈ ఏడాది ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు చేరుతారా? లేదా? అనేది చూడాల్సిందే.

నియోజకవర్గ పరిధిలో స్కూళ్లు..

ప్రభుత్వ క్వీన్‌మేరీ బాలికోన్నత పాఠశాల, ఎంవీడీ (లక్ష్మీటాకీస్) హైస్కూల్, దండుబజార్ జీవీఎంసీ హైస్కూల్, జీవీఎంసీ ప్రకాశరావుపేట హైస్కూల్, మహాత్మాగాంధీ మున్సిపల్ పాఠశాల, చెంగల్రావుపేట ప్రాథమిక పాఠశాల, గణేష్ పాఠశాల (ప్రసాద్‌గార్డెన్స్), రమాదేవి భానోజీరావు ప్రాథమికోన్నత పాఠశాల(డాబాగార్డెన్స్), అల్లిపురం ప్రాథమిక పాఠశాలతో పాటు పలు పాఠశాలలు ఉన్నాయి.



ప్రకాశరావుపేట జీవీఎంసీ పాఠశాల

ఆటలకు స్వస్తి..

దాదాపు రెండు నెలల పాటు ఆటలకు పరిమితమైన పిల్లలు బడిబాట పట్టాల్సిన సమయం వచ్చేసింది. మండుటెండలను లెక్క చేయని కొందరు విద్యార్థులు నిత్యం ఆటలకే పరిమితం కాగా.. మరి కొందరు గ్రంథాలయాల్లో చేపట్టిన వేసవి విజ్ఞాన శిబిరాల్లో పలు విషయాలు తెలుసుకోగలిగారు. నెలన్నర పాటు కిటకిటలాడిన క్రీడా ప్రాంగణాలన్నీ బోసిపోనున్నాయి.

కరెంట్ కోతలు ఆపండి



ఏఈకి వినతిపత్రం ఇస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కూర్మన్నపాలెం: తరచూ కరెంటు కోతలు, లోవోల్టేజీ సమస్యలకు పరిష్కారం చూపాలని 87వ వార్డు వైఎస్సార్‌సీపీ నాయకులు కోరారు. ఈ మేరకు వడ్లపూడి విద్యుత్ సబ్‌స్టేషన్ ఏఈ వీర్రాజును కలసి ఆ పార్టీ నాయకులు ఇల్లపు రాము, పి.వేణు, డి.దానప్పలు వినతిపత్రం సమర్పించారు. వార్డులోని వివిధ ప్రాంతాల్లో తరచూ విద్యుత్ కోతలతో పాటు లోవోల్టేజీ సమస్య తలెత్తుండడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని నాయకులు ఏఈ కి వివరించారు. సమస్యను తక్షణమే పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు బి.గోవిందరాజులు,శంకర్రావు, అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

కేజీహెచ్ సూపరింటెండెంట్‌కు అభినందనలు





డాక్టర్ వాణిని అభినందిస్తున్న ద్రోణంరాజు శ్రీవత్సవ్, డాక్టర్ వాణికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న నర్సింగ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలు టీజీ భవానీ ఇతర నర్సులు

మహారాణిపేట: కేజీహెచ్ నూతన సూపరింటెండెంట్ డాక్టర్ ఐ.వాణికి వైఎస్సార్‌సీపీ విశాఖ ప్రధాన కార్యదర్శి ద్రోణంరాజు శ్రీవత్సవ్ బుధవారం పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు. ఆస్పత్రిని అభివృద్ధి చేయడంలో సూపరింటెండెంట్ పాత్ర కీలకమైందని అన్నారు.

సూపరింటెండెంట్‌ను కలిసిన నర్సులు..

సూపరింటెండెంట్ డాక్టర్ ఐ.వాణిని బుధవారం ఏపీ ప్రభుత్వ నర్సింగ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలు టీజీ భవానీ ఆధ్వర్యంలో నర్సులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. కార్యక్రమంలో కార్యదర్శి జీవీఎస్.వరలక్ష్మి, ఎస్.జి.గౌరీ, మెహర్ శాంతి, పద్మజ తదితరులు పాల్గొని నర్సుల సమస్యలు నూతన సూపరింటెండెంట్ దృష్టికి తీసుకెళ్లారు.

విద్యార్థుల్లో నైతిక విలువలు పెంపొందించాలి



శ్రీహరితను సత్కరిస్తున్న బలరామకృష్ణ

గాజువాక: విద్యార్థులను ఉత్తమంగా తీర్చిదిద్దడానికి నైతిక విలువలు ఉపయోగపడతాయని రాజయోగ శిక్షణ నిపుణురాలు శ్రీహరిత అన్నారు. స్థానిక యాపిల్ ఐ స్కూల్‌లో ఉపాధ్యాయులతో బుధవారం ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో ఆమె ప్రసంగించారు. విద్యార్థులకు యోగా, ధ్యానం, సేవా, కృషి, జ్ఞానం అనే మార్గాలు అలవర్చాలన్నారు. ధ్యానం ద్వారా ఒత్తిడి, భావోద్వేగాలను అధిగమించవచ్చని, తద్వారా ఆరోగ్యం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో బ్రహ్మకుమారీ రాజయోగిని సోమేశ్వరి, పాఠశాల చైర్మన్ టి.బలరామకృష్ణ, ప్రిన్సిపాల్ జయశ్రీ శర్మ,టీబీకే కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.విష్ణువర్ధన్ పాల్గొన్నారు.

ఐఐఏఎం బిజినెస్ స్కూల్‌లో విదేశీ విద్య

ఎంవీపీకాలనీ: ఐఐఏఎం (ఇంటిగ్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ మేనేజ్‌మెంట్) బిజినెస్ స్కూల్ విదేశీ విద్యను అందించేందుకు ఇండో గల్ఫ్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ (ఐజీఎంఏ)తో ఒప్పందం కుదుర్చుకుంది. ఎంవీపీకాలనీలోని ఐఐఏఎం బీ–స్కూల్‌లో బుధవారం ఇరు సంస్థల ప్రతినిధులు ఎంవోయూ పత్రాలను మార్చుకున్నారు. ఈ సందర్భంగా ఐఐఏఎం కార్యదర్శి, డీన్ డాక్టర్ సుంకరి రవీంద్ర మాట్లాడుతూ తక్కువ ఖర్చుతో యువతకు నాణ్యమైన విద్యను అందించి.. అంతర్జాతీయ ఉద్యోగ, వ్యాపార అవకాశాలను అందుబాటులోకి తేవడమే లక్ష్యమన్నారు. ఐఐఏఎం బీ–స్కూల్ డైరెక్టర్ జనరల్ ఆచార్య కృష్ణమోహన్ మాట్లాడుతూ సైబర్ సెక్యూరిటీ, డేటా సైన్స్, మెషిన్ లెర్నింగ్, ఏఐ టెక్నాలజీలకు సంబంధించిన కోర్సులు ఈ ఒప్పందం ద్వారా విద్యార్థులకు అందుబాటులోకి వస్తాయన్నారు. విద్యార్థులు ఏడాది పాటు దుబాయ్‌లో విద్యనభ్యసించాల్సి ఉంటుందన్నారు. ఈ కోర్సులకు అసోసియేషన్ ఆఫ్ ఇండియన్ యూనివర్సిటీస్ ఆమోదం ఉందన్నారు. ఐజీఎంఏ అధ్యక్షుడు డాక్టర్ మోహన్‌లాల్ అగర్వాల్ మాట్లాడుతూ అంతర్జాతీయ అవకాశాలను యువతకు చేరువ చేసేందుకు ఈ ఎంవోయూ ఎంతగానో తోడ్పడుతుందన్నారు. ఈ సందర్భంగా డిజిటల్ యుగంలో సర్వీస్ మార్కెటింగ్, మేనేజ్‌మెంట్ విద్య విశిష్టత, కార్పొరేట్ అవసరాలు, ఏఐ సాంకేతిక అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం ఆయన్ని సత్కరించారు.